క్లుప్తంగా

10ఎంజీడీ వాటర్ ప్రాజెక్టు బెడ్‌ల శుద్ధి



క్లారిఫ్లోక్యులేటర్‌లో బురదను తొలగిస్తున్న సిబ్బంది

గాజువాక : స్థానిక 10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టులోని బెడ్‌లను సిబ్బంది శుక్రవారం శుద్ధి చేశారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రాజెక్టులోని అన్ని వాటర్ బెడ్స్‌లో, క్లారిఫ్లోక్యులేటర్‌లో బురదను తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బురద చేరడంతో సిబ్బంది ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అనంతరం కేబీఆర్ వాటర్ ప్రాజెక్టు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించారు.

ధరలు, పన్నుల తగ్గింపునకు వినతి



67వ వార్డు సచివాలయంలో సంతకాల ప్రతులను అందజేస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక : వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను, ఆస్తిపన్ను, చెత్తపన్ను, యూజర్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సచివాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. పెరిగిన ధరలకు జీఎస్టీ కూడా తోడవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఇటీవల సేకరించిన సంతకాల ప్రతులను ఆ పార్టీ నాయకులు కె.కిరీటం, యు.వి.ఎస్.ఎన్.వర్మ నేతృత్వంలో నాయకులు సచివాలయ అడ్మిన్లకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణవేణి, సత్యవతి, తూర్పాటి సూర్యకుమారి, సింగిరెడ్డి లక్ష్మి, ఈశ్వరరావు, పాలూరు లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



సర్వీసు రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ పెట్రోల్ బంక్ దాటిన తర్వాత షీలానగర్ నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు మార్గంలో సర్వీసు రోడ్డు పక్కన ఏర్పడిన భారీ గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో ఎక్కువగా ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఉండటంతో పాటు లారీలు పార్క్ చేస్తుంటారు. నిత్యం భారీ వాహనాలు తిరిగే మార్గంలో గొయ్యితో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహన చోదకులు తెలిపారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి, చర్యలు చేపట్టాలని కోరారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ వేడుక నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి కల్యాణం జరిపించారు.

సిరులనీయవే శ్రీ మహాలక్ష్మి..

- అమ్మవారిని అర్చించిన మహిళలు
- క్షీరాబ్ధి కన్యకకు కుంకుమార్చనలు



త్రిశక్తి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారు



ఉక్కు త్రిశక్తి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: సిరుల తల్లి శ్రీ మహాలక్ష్మిని మహిళలు భక్తిశ్రద్ధలతో అర్చించారు. శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- స్టీల్‌ప్లాంట్‌లోని త్రిశక్తి దేవాలయంలో శ్రావణ మాస పూజలు వైభవంగా జరిగాయి. వేకువజామున శ్రీమహాదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో సాయంత్రం 4 గంటలకు ఆలయ ఆవరణలో చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారికి సహస్ర సంపెంగ పుష్పార్చన చేశారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన

పెదగంట్యాడ: శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని నెల్లిముక్కులోని రామాలయం వద్ద మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కుంకుమార్చన చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వర రెడ్డి, గొందేశి అప్పలరెడ్డి మాట్లాడుతూ నెల్లిముక్కు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏటా శ్రావణ మాసలోని మూడో శుక్రవారం రామాలయంలో సామూహిక కుంకుమార్చనలు జరిపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పులి రమణారెడ్డి, సత్యారావు, దూడ సింహాచలం, పులి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నెల్లిముక్కు రామాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

క్యాన్సర్‌తో బాధ పడుతున్న చిన్నారి వైద్యానికి సహకారం



దిష్మిత తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న రామ అప్పారావు

అగనంపూడి: బ్లడ్ క్యాన్సర్‌తో విలవిల్లాడుతున్న రెండేళ్ల చిన్నారి వైద్యానికి అగనంపూడికి చెందిన సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు, ఆయన స్నేహితుల బృందం సహకారం అందించింది. పరవాడ మండలం భరణికం గ్రామానికి చెందిన సప్పా దిష్మిత బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. పాప తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో పనికి వెళ్తే తప్ప పూట గడవని పరిస్థితి. చిన్నారి పరిస్థితి గురించి తెలుసుకున్న రామ అప్పారావు, ఆయన స్నేహితుల వద్ద ప్రస్తావించడంతో స్పందించిన వారు రూ.20వేల నగదు అందించారు. ఉక్కు కో-ఆపరేటివ్ ఉద్యోగి సాలాపు సూరిబాబు నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, దాతలు గుదే సుశీలా గజేంద్రరావు, అక్కరాజు రాము తదితరులు పాల్గొన్నారు.

'ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యమివ్వాలి'



ఏసీఎం కిరోతో మాట్లాడుతున్న సలహా కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యమివ్వాలని దువ్వాడ రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ కిరోను కోరింది. దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో స్టేషన్‌లో సమస్యలు, వసతులపై కమిటీ ప్రతినిధులు ఏసీఎంతో చర్చించారు. స్టేషన్‌లో రైళ్ల హాల్ట్ సమయాన్ని పెంచాలని, ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంను అనుసంధానం చేస్తూ అండర్ పాత్‌వే ఏర్పాటు చేయాలని, స్టేషన్ ఆవరణలో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయాలని, నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీ ప్రతినిధులు లేళ్ల కోటేశ్వరరావు, కొలిపాక అప్పారావు, కె.వి.సుబ్బరాజు, కె.వి.ఎస్.ఎ.వర్మ, ఎం.అరుణ పాల్గొన్నారు.

'తిరుమల నగర్'కు విదేశీ ప్రతినిధుల ప్రశంసలు

- కాలనీలో పర్యావరణ హిత కార్యక్రమాలపై ఆసక్తి
- త్వరలో కాలనీని సందర్శిస్తామని వెల్లడి



ఫారిన్ డెలిగేట్స్‌తో సమావేశంలో పాల్గొన్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం సభ్యులు

కూర్మన్నపాలెం: స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణకు తిరుమల నగర్ సంక్షేమ సంఘం సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని విదేశీ ప్రతినిధులు కొనియాడారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్, జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, ఇమ్మాన్యుయేల్, లలిత, ఆనంద్ తదితరుల ఆధ్వర్యంలో తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులతో నగరంలోని జీవీఎంసీ కార్యాలయంలో శుక్రవారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంక్షేమసంఘం సభ్యులు తమ కాలనీలో అమలు చేస్తున్న కార్యక్రమాలను విదేశీ ప్రతినిధులకు తెలిపారు. చెత్తను విభజించి పారిశుధ్య కార్మికులకు అందించడం, తడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారీ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచడం, టెర్రస్ గార్డెన్‌పై మక్కువ చూపడం, నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. అనంతరం వారు తిరుమలనగర్ సంక్షేమ సంఘం యూట్యూబ్ చానెల్‌ను పరిశీలించి, అభినందించారు. నగరానికి దూరంగా ఉండడం వల్ల కాలనీలో పర్యటించలేకపోతున్నామని, మరోసారి తప్పక కాలనీని సందర్శిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఫారిన్ డెలిగేట్స్ ఎస్పెలియా (ఫ్రాన్స్), యాన్ పార్కర్, మిస్ జూడే అర్వెద్, గోస్వామి, ఎస్.ఐ.యు.ఏ నుంచి బిబెక్ సంధు, డాక్టర్ మొహమ్మద్, ఆరీఫ్, రాధా కర్మార్కర్, ఆసీఫ్ రాజా, తిరుమలనగర్ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాకు స్పందన

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీఎస్‌ఎస్‌డీసీ, మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ పట్టుదలతో సాధించలేనిది ఏమీ లేదన్నారు. జాబ్‌మేళాలో డబ్ల్యూఎన్ఎస్, ఎస్ఎన్ఎఫ్ ఫార్మా, ఫినో పేమెంట్ బ్యాంక్‌లు పాల్గొనగా, 119 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో 32 మంది ప్లేస్‌మెంట్ పొందారని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ కె. సాయికృష్ణ చైతన్య పేర్కొన్నారు. కళాశాల జేకేసీ కో-ఆర్డినేటర్ డి.అరుణ పద్మ, జేకేసీ మెంటార్ వీఎస్ రాజు, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ కె. ప్రశాంతి పాల్గొన్నారు.

'ఉక్కు' ఊపిరిని ఆపలేరు



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: పోరాటాలు, బలిదానాల ద్వారా ఏర్పాటు చేసుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ జోలికి వస్తే అధోగతి పాలుకాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 932వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆగస్టులో విశాఖ స్టీల్ ప్లాంట్ మెరుగైన అమ్మకాలు సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు సృష్టించినా.. విశాఖ ఉక్కు కర్మాగారం ఊపిరి ఆపివేయాలని చూసినా కార్మికులు మొక్కవోని దీక్షతో ప్లాంట్‌ను లాభాల దిశగా నడిపించేందుకు చేస్తున్న కృషికి జోహార్లు తెలుపుతున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో సీజనల్ వ్యాధులు దూరం



ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న జెడ్సీ సింహాచలం తదితరులు

గాజువాక : ప్రజలు అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధులను నిరోధించవచ్చని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని 65వ వార్డు భానోజీతోటలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, చెత్తను వేరు చేసి క్లాప్ వాహనాలకు ఇవ్వడం, ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం తదితర అంశాలపై నివాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి సహకరించాలన్నారు. చెత్తను సంబంధిత సిబ్బందికి అందించడంతో పాటు యూజర్ చార్జీలను సకాలంలో చెల్లించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని మానుకోవాలన్నారు. 120 మైక్రాన్ల లోపు మందం గల ప్లాస్టిక్ సంచులు, వస్తువులను వినియోగించరాదని సూచించారు. వాటికి ప్రత్యామ్నాయంగా గుడ్డ, నారతో తయారు చేసిన సంచులను ఉపయోగించాలని కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీల్లో ప్రజలంతా భాగస్వాములై విశాఖ మెరుగైన ర్యాంకు సాధించేందుకు సహకరించాలన్నారు. అనంతరం నేల బావులలో డెంగ్యూ దోమల నివారణకు గంబూసియా చేపలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

అగనంపూడి: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఐవోసీ జనరల్ మేనేజర్ అశోక్‌కుమార్ సాహు మాట్లాడుతూ ఐవోసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. బాలలకు వివిధ అంశాల్లో అవగాహన, పోటీతత్వం అలవరిచేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, ఐవోసీ భద్రతాధికారి ఎ.సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 74 మంది ఎంపిక



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. ఐఐఎఫ్ఎల్ సంస్థ ఫైనాన్స్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఆధాస్ సొల్యూషన్స్, ఎంఏఎస్ మెరైన్ సర్వీసెస్, ట్రీని టెక్ ఇన్ఫ్రా ఇండియా, టీం లీజ్, బయో ఫోర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మేధా సర్వో డ్రైవ్, రిలయన్స్ డిజిటల్ పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 690 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 287 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 74 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి అనంతరం జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

విద్యార్థి అదృశ్యం

పరవాడ: మండలంలో ఈదులపాక బోనంగి గ్రామానికి చెందిన జయకిరణ్ (14), హరికిరణ్(10) అనే విద్యార్థులు గత నెల 31న అదృశ్యమయ్యారని నడింపల్లి సత్యనారాయణ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి సీఐ పి.ఈశ్వరరావు అందించిన వివరాలు. ఈ. బోనంగి గ్రామానికి చెందిన నడింపల్లి సత్యనారాయణ తమ్ముడు కుమారులైన జయకిరణ్, హరికిరణ్‌లను కూర్మన్నపాలెంలోని చైతన్య పాఠశాలలో చదివిస్తున్నాడు. జయకిరణ్ 9వ తరగతి, హరికిరణ్ 8వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గత నెల 31న సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చి దుస్తులు మార్చుకున్నారు. టాయిలెట్‌కు వెళ్లి వస్తామని చెప్పి రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన అన్నదమ్ములిద్దరూ తిరిగి రాకపోవడంతో కంగారుపడి చుట్టుపక్కల గాలించినా కనిపించలేదు. అయితే హరికిరణ్ యలమంచిలి వద్ద శుక్రవారం దొరికాడు. జయ కిరణ్ ఆచూకీ కోసం గాలిస్తున్నామని సీఐ ఈశ్వరరావు తెలిపారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



అక్కిరెడ్డిపాలెంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ కదిరున్నిసా



షేక్ ఖాదర్‌కు పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ శివ

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రతీ నెల మాదిరిగానే 1వ తేదీ వేకువజామునే మొదలైంది. లబ్ధిదారులైన అవ్వా తాతలతో పాటు వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ రోగులు తదితరులకు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో వలంటీర్ కదిరున్నీసా లబ్ధిదారు దున్నా రాజేశ్వరికి వితంతు పెన్షన్‌ను కన్వీనర్ సయ్యద్ హుస్సేన్‌తో కలిసి అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు అప్పికొండ కాలనీకి చెందిన షేక్ ఖాదర్ అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఖాదర్ పింఛన్ కోసం ఇంటికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో కళింగవీధి సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ మహేంద్ర సూచనతో వలంటీర్ చొప్పా శివ కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్‌ను అందజేశారు. కదల్లేని స్థితిలో ఉన్న సమయంలో ఇంత దూరం వచ్చి పింఛన్ అందించినందుకు శివకు ఖాదర్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తి స్థాయిలో రహదారుల అభివృద్ధి

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 74వ వార్డులో రూ.71 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన



దయాల్‌నగర్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: నియోజకవర్గంలోని అన్ని వార్డులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధి నెహ్రూనగర్, దయాల్‌నగర్, దళ్లివానిపాలెం ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 74వ వార్డులో రూ.71లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే వార్డుల్లో సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల్లో పూర్తి సంతృప్తి ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. వార్డు కార్పొరేటర్ వంశీరెడ్డి మాట్లాడుతూ నెహ్రూనగర్, దళ్లివానిపాలెం, దయాల్‌నగర్‌లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను చకచకా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బి.గోవింద్, లోకేష్, ప్రసాద్, కేబుల్ శ్రీను, పాపారావు, పీకే నాయుడు, రామాలక్ష్మి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం అభినందనీయం



అవార్డు గ్రహీతలతో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మొహంతి, సొసైటీ పాలకవర్గం

ఉక్కునగరం: చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్టీల్‌ప్లాంట్ థ్రిఫ్ట్ సొసైటీ అవార్డులు ఇవ్వడం ద్వారా ప్రోత్సహించడం అభినందనీయమని స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి అన్నారు. థ్రిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెరిట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు అవార్డులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లల తల్లులు తీసుకుంటున్న శ్రద్ధ, బాధ్యతల వల్లనే పిల్లలు ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. ఏటా అవార్డులు ఇవ్వడం మంచి సంప్రదాయమన్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమంగా రాణించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కె. ఆనందకుమార్ తన ప్రసంగంలో సొసైటీ సాధిస్తున్న ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి డి. రామచంద్రమూర్తి, కోశాధికారి కొండరాజు, డైరెక్టర్లు కె.శ్రీనివాస్, బి.లాలూ, ఎం.వెంకటరమణ, జి.వి.రమేష్, వి.జి.మహీధర్, సొసైటీ సీనియర్ మేనేజర్ కె.దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీజీఎంకు అభినందనలు



సీజీఎం స్వామిని సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.వి.స్వామిని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు అభినందించారు. నూతన సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొత్త సీజీఎం నేతృత్వంలో ప్లాంట్ లాభాల బాట పట్టగలదనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. సీజీఎం స్వామి మాట్లాడుతూ అధికారులు, కార్మికుల సమష్టి కృషితో సమస్యలు తొలగి, ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, కర్రి దాలినాయుడు, పిట్టా రెడ్డి, ఎన్నేటి రమణ, బొడ్డ గోవింద, టి.చంద్రశేఖర్, వై.కోటి ప్రకాశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.